## సీతారామ ప్రాజెక్టు కాలువకు భూములు కావాలంటే ఎకరానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

### ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలని మాదారం రైతుల డిమాండ్



**ములకలపల్లి, జూలై 20 (తెలంగాణ వాణి)** సీతారామ ప్రాజెక్టు పిల్ల కాలువ నిర్మాణం కోసం భూములు సేకరిస్తే ఎకరానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ములకలపల్లి మండలం మాదారం గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో రైతులు పేర్కొన్న వివరాల ప్రకారం.. మాదారం గ్రామానికి చెందిన సుమారు 20 మంది సన్న, చిన్నకారు రైతుల భూములు కాలువ నిర్మాణంలో కోల్పోయే పరిస్థితి నెలకొంది. అర ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు మాత్రమే భూములు కలిగిన తమకు వ్యవసాయమే ఏకైక జీవనాధారమని తెలిపారు. అందునా సీతారామ ప్రాజెక్టు పిల్ల కాలువ వల్ల మాకు ఎటువంటి ఉపయోగం లేకపోగా తమ ప్రాంతానికి సాగునీరు కూడా రాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఎకరానికి రూ.13 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రతిపాదిస్తోందని, ఆ మొత్తంతో జీవనోపాధి కోల్పోయిన తమ కుటుంబాలు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు




ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆనుకుని అటవీ శాఖ భూమి అందుబాటులో ఉన్నందున, సాధ్యమైతే రైతుల భూములకు బదులుగా ఆ భూమిని సేకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ తమ భూములనే తీసుకోవాల్సి వస్తే గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకుని న్యాయమైన పరిహారం నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. తమకు, భావితరాలకు భరోసా కలిగేలా ఎకరానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, పరిహారం అంశంపై చర్చించేందుకు ప్రత్యేక అధికారుల బృందాన్ని మాదారం గ్రామానికి పంపించాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాదారం గ్రామ రైతులు తాండ్ర నాగబాబు, ముదిగొండ కృష్ణ, ఊకంటి కిషోర్, నారం ముత్యాలు, ఊకంటి మురళి, కనుకుంట్ల కృష్ణారెడ్డి, ప్రభాకర్ రావు, చిట్టిబాబు సీతారాములు తదితరులు పాల్గొన్నారు

## మద్యం తాగి ట్రాక్టర్ నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

**సుజాతనగర్, జూలై 20 (తెలంగాణ వాణి)** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్ 29న రాత్రి సుజాతనగర్ ఎస్ఐ ఎం. రమాదేవి ఆధ్వర్యంలో నాయకులగూడెం వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ములకలపల్లి మండలానికి చెందిన రవ్వా వినోద్ మద్యం సేవించి ట్రాక్టర్ నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో అతని శరీరంలో 210 మి.గ్రా./100 మి.లీ. ఆల్కహాల్ ఉన్నట్లు నమోదైంది. దీంతో మోటార్ వాహనాల చట్టం సెక్షన్--185 కింద కేసు నమోదు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం. రమాదేవి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

## వ్యాపారులు, రైతులకు పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యం

### మార్కెట్ యార్డ్ పరిశుభ్రతపై ఏఎంసీ చైర్మన్ లాల్ సింగ్ ప్రత్యేక దృష్టి

### పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించిన ఏఎంసీ చైర్మన్




**కొత్తగూడెం, జూలై 20 (తెలంగాణ వాణి)** రైతులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే మార్కెట్ యార్డును, మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించారు. చిన్న చినుకు పడిన ఎగువ నుండి వచ్చే వరద నీటి ప్రవాహంతో మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతమంత చిన్నపాటి పిల్ల కాలువలా మారి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాక, మార్కెట్ యార్డులోని దుకాణాలకు వెళ్లేందుకు దారి కూడా లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో చైర్మన్ లాల్ సింగ్ నాయక్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించడంతో పాటు డ్రైనేజీల శుభ్రపరచడం, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త సేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని సంజయ్ నగర్ సర్పంచ్ తాటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు దృష్టికి




తీసుకెళ్లారు. కాగా సోమవారం మార్కెట్ యార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించి, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు, ఈగలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మార్కెట్ యార్డ్ సిబ్బందిని ఆదేశించారు. రైతులు తమ పంటలను విక్రయించేందుకు వచ్చే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని చైర్మన్ పేర్కొన్నారు. మార్కెట్ యార్డు పరిశుభ్రంగా ఉంటే రైతులతో పాటు వ్యాపారులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. పరిశుభ్రమైన మార్కెట్ యార్డు ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి, ఏఎంసీ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.